# పని చేసిందెవరు.. అబద్ధాలు చెప్పేది ఎవరు..

- కాంగ్రెస్, బీజేపీల మాయమాటలు నమ్మద్దు
- బీఆర్ఎస్ మ్యానిఫెస్టోతో ప్రజల కష్టాలు దూరం
- ఓటేసి మరోసారి ఆశీర్వదించండి
- ప్రచారంలో మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి


గాండ్లపేటలో ప్రచారం నిర్వహిస్తున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

మోర్తాడ్, నవంబర్ 4 : ఎన్నికల వేళ ఎవరెవరో వస్తారు...అన్నీ అబద్ధాలు మాట్లాడుతారు...70 ఏండ్లుగా తెలంగాణను కాంగ్రెస్, బీజేపీలు పాలించాయి... కానీ కేవలం పదేండ్లు మాత్రమే తెలంగాణలో బీఆర్ఎస్ అధికారంలో ఉన్నది... పని చేసిందెవరు...పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నదెవరు ప్రజలు గుర్తించాల్సిన సమయం ఆసన్నమైందని బీఆర్ఎస్ బాల్కొండ అభ్యర్థి, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి అన్నారు. మోర్తాడ్ మండలంలోని సుంకెట్, దోన్‌పాల్, గాండ్లపేట్, భీమ్‌గల్ మండలం రూప్లాతండా, ఎంజీ తండా, బడాభీమ్‌గల్ గ్రామాల్లో శనివారం ప్రచార కార్యక్రమాల్లో భాగంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ 50 ఏండ్లు, టీడీపీ పొత్తుతో బీజేపీ 20ఏండ్లు పాలించాయి, మరి వారు ఇంటింటికీ నల్లా ఇచ్చి మహిళల నీటి కష్టాలు దూరం చేయాలని, ఆడబిడ్డల పెళ్లిళ్లకు కల్యాణలక్ష్మి ఇవ్వాలని, బీడీ కార్మికులకు పింఛన్ ఇవ్వాలని, అర్హులందరికీ రూ.2వేల పింఛన్ ఇవ్వాలని, రైతులకు సాగునీరు, రైతుబంధు ఇవ్వాలని ఎందుకు ఆలోచించలేదని అన్నారు. నాడు గుర్తుకు రానివి ఇప్పుడు ఎలా గుర్తుకు వచ్చాయన్నారు. మభ్యపెట్టాలని చూస్తున్నారని ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రతి ఇంటికీ ఏదో ఒకరూపంలో ప్రభుత్వ సాయం అందుతుందన్నారు.

**కాంగ్రెస్‌కు ఓటేస్తే కాళ రాత్రులే...**

కాంగ్రెస్ వాళ్ల మాటలు నమ్మి వారికి ఓటేస్తే కాళరాత్రులే మిగులుతాయని మంత్రి గతాన్ని గుర్తు చేశారు. కరెంటు ఎప్పుడు వస్తుందో రాదో వేచిచూడాల్సిన పరిస్థితులు ఉంటాయని, అర్ధరాత్రుల్లో కాళ్లు కాలువలో పెట్టి పడుకోవాల్సిన రోజులు తిరిగి వస్తాయని అన్నారు. మొన్ననే గెలిచిన కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీకి వ్యవసాయానికి ఐదుగంటల కరెంటు కూడా ఇవ్వలేని పరిస్థితిలో ఉందని, అక్కడి రైతులు కరెంటు కోసం ఆందోళనలు చేపడుతున్న పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. వారు అధికారంలో ఉన్న రాష్ట్రంలో పింఛన్ నాలుగువేలు, కరెంటు సరిగా ఇవ్వకుండా ఇక్కడ ఇస్తా మంటే ఎట్ల నమ్ముదామన్నారు. అదే మహారాష్ట్రంలో బీజేపీ అధికారంలో ఉన్న ప్రాంతంలో సాగుకు 5 హెచ్‌పీ మోటర్ కనెక్షన్ కావాలంటే ప్రభుత్వానికి రూ.2 లక్షలు కట్టాలి, కనెక్షన్ తీసుకోవడానికి ఖర్చులు, ఇక ఏటా సాగునీటి కోసం రూ.10,500 చెల్లించాల్సి వస్తున్నదన్నారు. వారు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లో చేయని పనులు, సంక్షేమాలు తెలంగాణలో ఏ విధంగా చేస్తా రు అన్నారు. కాంగ్రెస్, బీజేపీ వాళ్లు ఓట్ల కోసం వస్తే వా రిని ఈవిషయంలో నిలదీయాలని ప్రజలను కోరారు.

**ఆశీర్వదించండి..సంక్షేమాలు అందుకోండి**

మరోసారి బీఆర్ఎస్‌ను ఆశీర్వదిస్తే మరింత అభివృద్ధి సాధించడంతో పాటు రేషన్‌కార్డుపై సన్నబియ్యాన్ని తీసుకోవచ్చని మంత్రి చెప్పారు. భూమిలేని వారందరికీ రూ.5లక్షల కేసీఆర్ బీమా చేయడం జరుగుతుందని, ఎటువంటి సంక్షేమ పథకం అందని మహిళలకు రూ.3 వేల సౌభాగ్యలక్ష్మిని అందిస్తామని, పింఛన్ రూ.5 వేలకు, రైతుబంధు రూ.16వేలకు దశల వారీగా పెంచడం జరుగుతుందని చెప్పారు.

# సీఎం కేసీఆర్‌ను భారీ మెజారిటీతో గెలిపిస్తాం

## బీఆర్ఎస్‌కు మద్దతుగా స్వర్ణకార సంఘాల ఏకగ్రీవ తీర్మానం


సీఎం కేసీఆర్‌కు మద్దతుగా తీర్మాన పత్రాన్ని అందజేస్తున్న స్వర్ణకారులు

బీబీపేట్, నవంబర్ 4: సీఎం కేసీఆర్‌ను భారీ మెజార్టీతో గెలిపించుకుంటామని మండలంలోని అన్ని గ్రామాల స్వర్ణకార సంఘాల సభ్యులు జనగామ గ్రామంలో ఏకగ్రీవ తీర్మానం చేశారు. తీర్మాన కాపీని కామారెడ్డి నియోజకవర్గ ఎన్నికల సమన్వయ కమిటీ సభ్యుడు తిమ్మయ్యగారి సుభాష్‌రెడ్డి, జడ్పీ వైస్ చైర్మన్ పరికి ప్రేమ్‌కుమార్, బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు వెంకట్‌గౌడ్‌కు శనివారం అందజేశారు.

**మంత్రి వేములకు గౌడ సంఘం మద్దతు**

మోర్తాడ్, నవంబర్ 4: బాల్కొండ నియోజకవర్గ బీఆర్ఎస్ అభ్యర్థి, మంత్రి వేముల వేముల ప్రశాంత్‌రెడ్డికే తమ పూర్తి మద్దతు తెలుపుతున్నట్లు మండలంలోని వడ్యాట్ గ్రామానికి చెందిన గౌడ సంఘ సభ్యులు (42 కుటుంబాలు) శనివారం ఏకగ్రీవ తీర్మానం చేశారు. ఈ మేరకు తీర్మాన పత్రాన్ని స్థానిక బీఆర్ఎస్ నాయకులు గంధం మహిపాల్, వెల్మ రవీందర్‌కు అందజేశారు.


మంత్రికి మద్దతుగా ఏకగ్రీవ తీర్మానం చేస్తున్న వడ్యాట్ గౌడ సంఘ సభ్యులు



నిజామాబాద్ రూరల్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్‌కు మద్దతుగా ఆయన స్వగ్రామమైన చీమన్‌పల్లిలో అన్ని కులాల సభ్యులు సర్పంచ్ క్యాతం శివారెడ్డి ఆధ్వర్యంలో శనివారం ఏకగ్రీవ తీర్మానం చేశారు. కారు గుర్తుకు ఓటు వేసి బాజిరెడ్డిని భారీ మెజార్టీతో గెలిపిస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ బన్నీనాయక్, బీఆర్ఎస్ గ్రామ అధ్యక్షుడు బుక రాజు, నాయకులు పాల్గొన్నారు.

– సిరికొండ, నవంబర్ 4

# పెరుగుతున్న గులాబీ బలగం

- అభివృద్ధికి ఆకర్షితులై

బీఆర్ఎస్‌లోకి భారీగా చేరికలు


మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరిన వివిధ పార్టీల నాయకులు

వేల్పూర్/ధర్పల్లి/ఆర్మూర్, నవంబర్ 4 : ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో బీఆర్ఎస్‌లోకి వలసల జోరు కొనసాగుతున్నది. బీజేపీ, కాంగ్రెస్‌తో పాటు ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలు స్వచ్ఛందంగా పార్టీలో చేరుతున్నారు. తాజాగా కమ్మర్‌పల్లి, మోర్తాడ్, పల్లికొండ, భీమ్‌గల్ నుంచి సుమారు 150 మంది మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి సమక్షంలో శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి వేముల గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో కమ్మర్‌పల్లి రజక సంఘం నాయకులు, మోర్తాడ్ వ్యాయామశాఖ యూత్ సభ్యులు, పల్లికొండకు చెందిన హవా యూత్ సభ్యులు, లింగాపూర్ నుంచి కాంగ్రెస్ పార్టీకి చెందిన పవన్ కళ్యాణ్, భీమ్‌గల్ టౌన్ కాంగ్రెస్ మైనార్టీ వైస్‌ప్రెసిడెంట్ జుబేర్, సల్మాన్, అజయ్ గౌడ్ ఉన్నారు.

**బాజిరెడ్డి సమక్షంలో 70 మంది చేరిక**

ధర్పల్లి మండలం దుబ్బాక గ్రామంలోని కాంగ్రెస్, బీజేపీకి చెందిన యువకులు, నాయకులు శనివారం బీఆర్ఎస్‌లో చేరారు. వారికి బీఆర్ఎస్ రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ వీజీగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**బీఆర్ఎస్‌లో చేరిన గొల్లకురుమ నాయకులు**

ఆర్మూర్ నియోజకవర్గ పరిధిలోని గొల్ల కురుమ జిల్లా నాయకులు రానున్న ఎన్నికల్లో తమ పూర్తి మద్దతు బీఆర్ఎస్‌కు ప్రకటిస్తూ శనివారం అంకాపూర్‌లోని ఎమ్మెల్యే నివాసంలో ఆర్మూర్ ఎమ్మెల్యే, పీయూసీ చైర్మన్ ఆశన్నగారి జీవన్‌రెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి జీవన్‌రెడ్డి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయానికి కృషి చేయాలన్నారు. బీఆర్ఎస్‌లో చేరిన వారిలో జిల్లా యాదవ సంఘం కన్వీనర్ గంగుల బాబురావు, ఆర్మూర్ యాదవ సంఘం కన్వీనర్ రాజమల్లు యాదవ్, డొంకేశ్వర్ మండల యాదవ సంఘం అధ్యక్షుడు రాజన్నయాదవ్, నందిపేట మండల అధ్యక్షుడు కిష్టాన్న యాదవ్, నందిపేట మండల ప్రధాన కార్యదర్శి సాగర్‌యాదవ్, నందిపేట యాదవ సంఘం యూత్ అధ్యక్షుడు విజయ్‌యాదవ్, దేగాం చిన్నయ్య, మహేశ్ యాదవ్, తరుణ్‌యాద్ ఉన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు, ఓయూ నేత రాజారాం యాదవ్, మున్సిపల్ వైస్ చైర్మన్ షేక్ మున్నా, సీనియర్ నాయకులు అర్గుల్ సురేశ్, లింబాద్రి తదితరులు పాల్గొన్నారు.


పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్


పార్టీలో చేరుతున్న వారికి గులాబీ కండువాలు కప్పుతున్న ఎమ్మెల్యే జీవన్‌రెడ్డి


